క్లుప్తంగా

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలి

గుండాల: మండలంలోని ప్రతీ గ్రామంలో నెల కొన్న ప్రతీ సమస్యను పరిష్కరించాలని, చిన్న చిన్న సమస్యకు ప్రజలు ఇబ్బందులు పడే పరిస్థితి ఉండొద్దని ఎంపీపీ ముక్తి సత్యం, జెడ్పీటీసీ వాగబోయిన రామక్కలు అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన చివరి సర్వసభ్య సమావేశం జరిగింది. వివిధ శాఖ అధికారులు మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై నివేదికలు చదివివినిపించారు. వర్షాలు, వరదల నేపథ్యంలో చర్యలు, సీజనల్ వ్యాధుల నివారణపై ప్రజాప్రతినిధులు పలు సూచనలు చేశారు. అన్ని శాఖల అధికారులు మండలాభివృద్ధిపై దృష్టి సారించాలని అన్నారు. ఎంపీటీసీ కల్తి కృష్ణారావు, పద్మ, క్రిష్ణవేణి, తహసీల్దార్ ఇమ్మానుయేల్, ఎంపీడీఓ సత్యనారాయణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రమాదాలను నివారించండి

మణుగూరురూరల్: సింగరేణిలో ప్రమాదాల నివారణకు కఠిన చర్యలు చేపట్టాలని మణుగూరు ఏరియా కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గోదావరిఖని ఓసీ2లో జరిగిన ప్రమాదంలో ఇద్దరు సింగరేణి కార్మికులు మరణించడం పట్ల శనివారం ఏరియా ఓసి2 కార్మికులు సంతాపం వ్యక్తం చేస్తూ.. రెండు నిముషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు మాట్లాడారు. నాయకులు మేకల ఈశ్వర్, వత్సవాయి కృష్ణంరాజు, వి.వెంకటరత్నం, కార్మికులు కోడిరెక్కల శ్రీనివాస్, నయమత్ హుస్సేన్, బి.వెంకటేశ్వర్లు, శంకర్, లక్ష్మణరావు, రామ్మూర్తి, దశరథ్, సతీష్, రాయలింగు తదితరులు పాల్గొన్నారు.

ర్యాపిడ్ ఫీవర్ సర్వే

చర్లరూరల్: మండలంలోని లక్ష్మీకాలనీ, గొమ్ము గూడెం తదితర గ్రామాల్లో వైద్య సిబ్బంది శనివారం ర్యాపిడ్ ఫీవర్ సర్వే నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి జ్వరాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. జ్వరాలు సోకితే వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి రావాలన్నారు.

ఉన్నత స్థాయికి చేరాలి

అన్నపురెడ్డిపల్లి: విద్యార్థులు పాఠశాల దశ నుండే ఉన్నత విలువలతో కూడిన విద్యను అభ్యసించి, భవిష్యతులో ఉన్నతమైన ఉద్యోగాల్లో స్థిరపడాలని, బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజర్ రాకేష్ ఆకాంక్షించారు. శనివారం మండలంలోని ఎర్రగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన, తల్లితండ్రుల సమావేశంను ప్రధానోపాధ్యాయులు ఆనంద్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో బ్యాంక్ ఆఫ్ బరోడా ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, జామెట్రీకల్ బాక్సులను వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా ఆ బ్యాంకు మేనేజర్ మాట్లాడారు. ఉపాధ్యాయులు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

వరద బాధితులకు వితరణ

అశ్వారావుపేటరూరల్: మండలంలోని గుమ్మడవల్లి గ్రామానికి చెందిన పెదవాగు ప్రాజెక్టు వరద బాధిత కుటుంబాలకు శనివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వితరణ అందజేశారు. నియోజకవర్గ ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆదేశాల మేరకు అశ్వారావుపేట పార్టీ ప్రముఖ నాయకులు జూపల్లి రమేష్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబాలకు ఉచితంగా దుప్పట్లు పంపిణీ చేసి, భోజనాలు సమకుర్చారు. కార్యక్రమాల్లో మాజీ ఎంపీటీసీ నండ్రు రమేష్, జూపల్లి ప్రమోద్, చెన్నారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు తిరుపతిరావు, సత్తిబాబు పాల్గొన్నారు.

ప్లే డేలు తగ్గించొద్దు

మణుగూరుటౌన్: ఓసీ–2లో పనిచేస్తున్న కార్మికులు ఎండనక, వాననక బొగ్గు లక్ష్యాల కోసం నిరంతరం శ్రమిస్తుంటే అధికారులు ప్లే డేలు తగ్గించి కార్మికుల పొట్ట కొట్టే ప్రయత్నం చేయడం సరికాదని హెచ్ఎంఎస్ వైస్ ప్రెసిడెంట్ కొడిపల్లి శ్రీలత అన్నారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. ప్లేడేలను అందరికీ సమానంగా ఇవ్వాలని హెచ్ఎంఎస్ మణుగూరు తరఫున డిమాండ్ చేశారు. ప్రధాన కార్యదర్శి రమేశ్ బాబు ఉన్నారు.

సంఘం బలోపేతానికి కృషి చేయాలి

మణుగూరురూరల్: పవర్‌స్టార్ పవన్ కల్యాణ్ అభిమానుల సంఘం బలోపేతానికి కృషి చేయాలని ఆ సంఘం గౌరవ అధ్యక్షుడు బేతం చర్ల వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని వేణురెస్టారెంట్ ఫంక్షన్ హాల్‌లో సంఘం పినపాక నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో బేతంచర్ల వెంకటేశ్వరరావు మాట్లాడారు. సురేందర్ పాటిల్, బత్తుల అనిల్ కుమార్, ప్రదీప్‌కుమార్, యుగంధర్, బండ్ల బాల, ఆటో బాలయ్య, నరసింహ పాల్గొన్నారు.

హాస్టల్ వసతి కల్పించాలి

ములకలపల్లి: జూనియర్ కళాశాలలో విద్యనభ్యసించే విద్యార్థినీ, విద్యార్థులకు వేర్వేరుగా పోస్టుమెట్రిక్ హాస్టల్ వసతి కల్పించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ వర్కా అజిత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలను శనివారం సంఘ ప్రతినిధి బృందం సందర్శించి, పలు సమస్యలను గుర్తించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. నవీన్, ప్రభాస్. రవి, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

కదిలిన అధికార యంత్రాంగం

- వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటన
- అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచన
- తగిన ఏర్పాట్లకు సిబ్బందికి ఆదేశాలు


బూర్గంపాడు: పాత గొమ్మూరు వద్ద గోదావరి వరదను పరిశీలిస్తున్న డీపీఓ చంద్రమౌళి


పినపాక: ఎల్చిరెడ్డిపల్లిలో పరిశీలిస్తున్న డీఎల్పీఓ సుధీర్ కుమార్

బూర్గంపాడు: వరద ప్రభావిత ప్రాంతాలలో ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి గ్రామపంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. మండల పరిధిలోని గోదావరి వరద ముంపు ప్రభావిత ప్రాంతాలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరద ఉధృతి పెరుగుతున్నందున గ్రామాల్లో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. పారిశుద్ధ్య చర్యలకు ఆదేశించారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి సునీల్, పంచాయతీ కార్యదర్శులు బాలయ్య, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

డీఎస్పీ ఆధ్వర్యంలో..

గోదావరి వరదల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పాల్వంచ డీఎస్పీ ఆర్ సతీష్ సూచించారు. మోతె, ఇరవెండి గ్రామాలలోని వరద ముంపు ప్రభావిత ప్రాంతాలలో శనివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికార యంత్రాంగానికి సహకరించాలని, ఇతర శాఖలను సమన్వయం చేసుకుంటు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఆయన వెంట ఎస్సైలు రాజేష్, నాగభిక్షం తదితరులు పాల్గొన్నారు.

పినపాక: అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎల్పీఓ సుధీర్ కుమార్ సూచించారు. ఈ మేరకు శనివారం మండల పరిధిలోని బయ్యారం, రాయగూడెం, ఎల్చిరెడ్డిపల్లి పంచాయతీలో పర్యటించారు. వర్షాలకు దెబ్బతినే ప్రాంతాలు, రహదారులు, కల్వర్టులను పరిశీలించారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని, పునరావాస కేంద్రాలను ముందుగానే ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామకృష్ణ, ఎంపీఓ వెంకటేశ్వరరావు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గుండాల: గత నాలుగైదు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు గుండాల, ఆళ్లపల్లి మండలాల్లో వాగులు దాటొద్దని, స్థానిక అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని గుండాల తహసీల్దార్ ఇమ్మానెయేల్, ఎంపీడీఓ సత్యనారాయణ, సీఐ రవీందర్, ఆళ్లపల్లి ఎంపీడీఓ శ్రీనివాసరావులు అన్నారు. ఆయా మండలాల్లో ఉప్పొంగుతున్న వాగులను వారు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గర్భిణులను ముందస్తుగా స్థానిక ఆస్పత్రికి తరలించాలని, పశువుల కాపర్లు, కూలీలు వాగులు లేని క్రమంలోనే ఇళ్లకు చేరుకోవాలని సూచించారు.

కరకగూడెం: భారీ వర్షాలు, వరదల పట్ల అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని భద్రాచలం డీఎల్పీ సుధీర్ కుమార్ సూచించారు. ఈ మేరకు ఆయన శనివారం మండలంలోని కోతకు గురై మరమ్మతులు చేసిన చిరుమళ్ల, బూడిద వాగు, రఘునాథపాలెం బ్రిడ్జిలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాణ, ఆస్తి నష్టం లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. అధికారులు అలసత్వం వహించవద్దని సూచించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి దినేష్ కుమార్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ దేవా వర కుమార్, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అశ్వాపురం: గోదావరి పెరుగుతున్న దృష్ట్యా గోదావరి పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ అశోక్‌రెడ్డి సూచించారు. మండల పరిధిలోని అమ్మగారిపల్లి, పాములపల్లి గ్రామాలలో గోదావరి వరదను శనివారం సీఐ అశోక్‌రెడ్డి పరిశీలించి స్థానికులతో మాట్లాడారు. గోదావరి వద్దకు ఎవరు వెళ్లవద్దని, జాలర్లు చేపల వేటకు వెళ్లద్దని సూచించారు.

దమ్మపేట: వరద ప్రభావిత, లోతట్టు ప్రాంతాలను ఎంపీడీఓ రవీంద్రనాథ్ రెడ్డి తన సిబ్బందితో కలిసి పరిశీలించి, డ్రైయిన్‌లలో వరద నీరు ప్రవహించేలా తక్షణ చర్యలను చేపట్టారు.

గుండాల: గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఉప్పొంగుతున్న వాగులను ఎట్టి పరిస్థితిలో దాటొద్దని గుండాల సీఐ రవీందర్, కాచనపల్లి ఎస్సై సోమేశ్వర్‌లు అన్నారు. శనివారం మండలంలోని చెట్టుపల్లి పంచాయతీలో పర్యటించి వాగులను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎలాంటి పరిస్థితుల్లో కూడా వాగులు దాటరాదని సూచించారు. అత్యవసర సమయంలో పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. పోలీసులు మైక్ ద్వారా ఆయా పంచాయతీ గ్రామాలలో అవగాహన కల్పించారు.

మూడోరోజూ అదేతీరు..

ఏకధాటిగా కురుస్తున్న వర్షాలు వరుసగా మూడో రోజు శనివారం కూడా కుంభవృష్టిని సృష్టించాయి. ముసురు వాతావరణానికి జనజీవనం స్తంభించింది. జనం ఇళ్లకే పరిమితమవడంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. వాగులు, ప్రాజెక్టులు అలుగు పోస్తూ, కొత్తనీటితో జలకళను సంతరించుకుంది. చెరువుల్లో ఇప్పుడిప్పడే నీరు చేరుతోంది. కాగా, వరద ప్రభావం లోలెవల్ చప్టాలను ముంచెత్తడంతో గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. కొన్నిచోట్ల డైవర్షన్ రోడ్లు కోతకు గురికావడంతో ప్రజలు ఇబ్బందిపడ్డారు.

– సాక్షి నెట్‌వర్క్


దుమ్ముగూడెం: పెద్దనల్లబల్లి- కే లక్ష్మీపురం మధ్య రహదారిపై గుబ్బలమంగి వాగు ప్రాజెక్టు నీరు..


చర్ల: లింగాపురంపాడు సమీపంలో ఉధృతంగా ప్రవహిస్తున్న ఈతవాగు


దమ్మపేట: వెంకటరాజాపురం గ్రామంలో రోడ్డుపై పడిన చెట్టు


దుమ్ముగూడెం: పర్ణశాల నార చీరల ప్రాంతం దుకాణాల చుట్టూ చేరిన వరద నీరు


ములకలపల్లి: పాములేరు వాగుపై డైవర్షన్ రోడ్డు కొట్టుకుపోవడంతో నిర్మించిన ఇనుప వంతెన

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే 'పెదవాగు'కు గండి


పెదవాగు ప్రాజెక్టును పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

అశ్వారావుపేటరూరల్: రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం, అధికారుల సమన్వయ లోపం వల్లే పెదవాగు ప్రాజెక్టుకు భారీ గండి పడేందుకు కారణమని అశ్వారావుపేట నియోజక వర్గ మాజీ ఎమ్మెల్యేలు మెచ్చా నాగేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లు ఆరోపించారు. శనివారం వారు వేర్వేరుగా మండలంలోని గుమ్మడవల్లి వద్దగల పెదవాగు ప్రాజెక్టు గండి పడిన ప్రదేశాన్ని సందర్శించారు. అనంతరం వరద బాధితులతో మాట్లాడి అండగా ఉంటామని అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..వర్షాల సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని ప్రాజెక్టు వద్ద ముందస్తు చర్యలు, జాగ్రత్తలు పాటించడంలో విఫలమైయ్యారని అన్నారు. తక్షణమే వరద బాధిత కుటుంబాలను ఆదుకోవాలని, ఒకొక్క కుటుంబానికి రూ.5లక్షల నష్టపరిహారం, ఎకరానికి రూ. 50 వేలు, పశు సంపద కోల్పోయిన వారిని ఆదుకోవాలని కోరారు. అలాగే బాధితులకు త్వరగా పరిహారం వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ డి.మధును కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, మాజీ జడ్పీటీసీ అంకత మల్లికార్జున్‌రావు, బీఆర్ఎస్ నాయకులు మందపాటి మోహన్‌రెడ్డి, సత్యవరపు సంపూర్ణ, కాసాని చంద్రమోహన్, పొట్టా రాజులు, చందా లక్ష్మీనర్సయ్య, పుట్టా సత్యం, నారం రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో వర్షపు నీరు


చంద్రుగొండ: ప్రభుత్వ పాఠశాల గదుల్లోకి చేరిన వర్షపునీరు

చంద్రుగొండ: మండలంలోని తిప్పనపల్లి గ్రామంలోని ముస్లింవీధిలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో వర్షపునీరు శనివారం గదుల్లో చేరాయి. మోకాళ్లలోతు నీరు నిలబడటంతో తరగతుల నిర్వహణ సాధ్యం కాని పరిస్థితి నెలకొంది. దీంతో విద్యార్థులు ఇంటి ముఖం పట్టారు. ఈ పాఠశాల అభివృద్ధి కోసం గడిచిన ఏడాది అప్పటి ప్రభుత్వం మన ఊరు మనబడి పథకం కింద రూ.5.5 లక్షలు నిధులు మంజూరు చేసింది. సదరు నిధులతో అభివృద్ధి పనులు చేశారు. పనులు నిర్వహణలో భాగంగా పాఠశాల భవనం చుట్టు ఎత్తు లేపడం ద్వారా నేడు వర్షపునీరు గదుల్లో చేరుతున్నాయని తెలుస్తోంది. కాంట్రాక్టర్, ఇంజినీరింగ్ అధికారులు అనాలోచిత పనులు ద్వారా నేడు ఈ పరిస్థితి నెలకొందని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

చర్లరూరల్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని అనేక ప్రాంతాలు జలమయమయ్యాయి. శనివారం కురిసిన వర్షానికి రాళ్ళగూడెంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల చెరువును తలపించింది. పాఠశాల లోనికి విద్యార్థులు రావడానికి అనేక ఇబ్బందులు పడాల్సి వచ్చింది. పాఠశాలలో ఉండేందుకు వీలు లేకుండా ఉండడంతో తల్లిదండ్రులు విద్యార్థులను ఇంటికి తీసుకుని వెళ్లారు. వెంటనే పంచాయతీ, రెవెన్యూ అధికారులు అక్కడకు చేరుకుని, వర్షపు నీటిని బయటకు పంపే ప్రయత్నం చేశారు.

ప్రజలను ఆదుకుంటాం..


ఎమ్మెల్యే వెంకట్రావుకు సమస్యలు తెలుపుతున్న కాలనీ వాసులు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలో వర్షాలు, గోదావరి ముంపుకు గురయ్యే కాలనీల ప్రజలను ప్రభుత్వం అని విధాలుగా అదుకుంటుందని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అన్నారు. పట్టణంలోని రామాలయం ప్రాంతం, అయ్యప్ప కాలనీ, అశోక్ నగర్ కొత్త కాలనీ, సుభాష్ నగర్ కాలనీలో వర్షపు నీటితో పాటు గోదావరి బ్యాక్ వాటర్ ద్వారా ముంపు గురయ్యే కాలనీలను ఆయన శనివారం అధికారులతో కలిసి పరిశీలించారు. జోరు వానలో సైతం ప్రతి కాలనీ తిరిగి కాలనీలలో ఉన్న సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కాలనీల్లో డ్రెయినేజీ సమస్యలు ఉందని, విద్యుత్ లైన్ లేకపోవడం తదితర సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే.. కాలనీ వాసులు తెలిపిన సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. మండల నాయకులు రత్నం రమాకాంత్, కొండిశెట్టి కృష్ణమూర్తి, అరికెల తిరుపతిరావు, నర్రా రాము, చింతాడి చిట్టిబాబు, మామిడి పుల్లారావు, భీమవరపు వెంకటరెడ్డి, చెగొండి శ్రీనివాస్, ఒగ్గే రమణా, యూత్ నాయకులు గాడి విజయ్, మాచినేని భాను, పుల్లగిరి నాగేంద్ర, బెతంపుడి భరత్, పిట్టల రాజు, జమిర్ మహిళ నాయకురాలు సాయి కుమారి, పిట్టల లక్ష్మి కాంతం పాల్గొన్నారు.

వినాయక నగర్‌లో కమిషనర్ పర్యటన


వినాయక నగర్‌లో పర్యటిస్తున్న మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్

మణుగూరుటౌన్: శుక్రవారం రాత్రి నుంచి శనివారం మధ్యాహ్నం వరకు కురిసిన వర్షానికి మున్సిపాలిటీ పరిధిలోని వినాయక నగర్ పూర్తిగా ముంపునకు గురైంది. ఎమ్మెల్యే పాయం ఆదేశాల మేరకు శనివారం మున్సిపాలిటీ కమిషనర్ ఉమా మహేశ్వరరావు, తహసీల్దార్ రాఘవరెడ్డి ముంపు ప్రాంతంలో పర్యటించారు. కొద్దిపాటి వర్షానికి వరద వస్తున్నట్లు స్థానికులు వివరించడంతో.. వరద రావడానికి కారణాలను పూర్తి స్థాయిలో అన్వేషించారు. సింగరేణి ఉపరితల గని నుంచి వస్తున్న వరద నీటితో పాటు విప్పలసింగారం పంచాయతీ నుంచి వరద నీరు వినాయకనగర్‌కు తరలి వస్తోందని అధికారులు తేల్చారు. ఆ నీటి మళ్లింపు విషయం ఏరియా జీఎం దుర్గం రాంచందర్ తోపాటు జిల్లా కలెక్టర్‌కు సమాచారం అందించామని, వీలైనంత త్వరలో ముంపు సమస్య నుంచి తప్పిస్తామని భరోసానిచ్చారు. అదేవిధంగా ముంపునకు గురైన మామిడితోట ఏరియాను మున్సిపల్ కమిషనర్ పరిశీలించి యంత్రాలతో వెంటనే నీటిని మళ్లించారు. ఆర్ఐ లీలావతి, రెవెన్యూ సిబ్బంది మున్సిపాలిటీ సిబ్బంది పర్యటించిన వారిలో ఉన్నారు.

పక్కా ఇళ్లు నిర్మించాలి

భద్రాచలంటౌన్: పట్టణంలో వర్షా కాలం గోదావరి బ్యాక్ వాటర్‌తో ముంపు గురయ్యే కాలనీలోని ప్రజలకు సురక్షత ప్రాంతాల్లో పక్కా ఇళ్లను నిర్మించాలని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు దాసరి శేఖర్ అన్నారు. పట్టణంలోని ఆశోక్‌నగర్ కాలనీలో శనివారం జరిగిన ముఖ్య కార్యకర్త సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రవి, శ్రీను, రాజ్‌కుమార్, రాజశేఖర్, జయకుమారి, రమ పాల్గొన్నారు.

వరి పొలాన్ని తలపిస్తున్న రహదారి


రోడ్డుపై నాట్లు వేసి నిరసన తెలుపుతున్న సుందరయ్యనగర్ వాసులు

పినపాక: మండల పరిధిలోని జానంపేట నుండి వలస ఆదివాసి గ్రామమైన సుందరయ్య నగర్ కు వెళ్లే రహదారి వరి పొలాన్ని తలపిస్తుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు శనివారం రహదారిపై వరి నాటు వేసి నిరసన తెలిపారు. 2020 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం బీటి రోడ్డు మంజూరు చేయగా ఇప్పటివరకు రోడ్డు నిర్మాణం జరగలేదు. అధికారులు స్పందించి రహదారి నిర్మాణం పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

తరచూ విద్యుత్ అంతరాయం

దమ్మపేట: మండల కేంద్రంలో రోజంతా విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం కలిగింది. శనివారం ఉదయం నుండి పలుమార్లు విద్యుత్ పలుమార్లు మెరుపులా వచ్చి కొద్దినిమిషాల్లోనే పోయిందని గ్రామస్తులు వాపోతున్నారు. విద్యుత్ శాఖ అధికారులను గ్రామస్తులు ఫోన్‌లో అడగగా.. మరమ్మతులు చేస్తున్నామని, కొద్దిసేపట్లోనే కరెంటు వస్తుందని చెప్పినప్పటికీ, ఫలితం లేదు.

పంట నష్టంపై సర్వే

అశ్వారావుపేటరూరల్: వర్షాలు, వరద ప్రభావంతో దెబ్బతిన్న పంటల వివరాలను వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో శనివారం సేకరించారు. మండలంలోని నారాయణపురం, గుమ్మడవల్లి, కొత్తూరు, అనంతారం, గాండ్లగూడెం గ్రామాల్లో అశ్వారావుపేట ఏడీఏ అఫ్జల్ బేగం ఆధ్వర్యంలో సిబ్బంది సర్వే చేపట్టారు. 450 ఎకరాల్లో ఇసుక మేటలు, 140 ఎకరాల్లో వరి, పత్తి 60 ఎకరాల్లో, 40 ఎకరాల్లో పామాయిల్ పంటలు దెబ్బతిన్నట్లు తొలి రోజు చేసిన సర్వేలో గుర్తించారు.

నిత్యాన్నదానానికి విరాళం

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థానంలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి ఏపీలోని కృష్ణా జిల్లాకు చెందిన రామకృష్ణ మోహన్–పద్మజ దంపతులు రూ.లక్ష చెక్కును ఆలయ అధికారులకు అందజేశారు.

వైభవంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలోని బాలాజీ వేంకటేశ్వర స్వామి వారి కల్యాణాన్ని ప్రధాన అర్చకుడు ప్రసాదాచార్యులు శనివారం వైభవంగా జరిపించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

బీజేపీ మహిళా అధ్యక్షురాలిగా పార్వతి

ములకలపల్లి: భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ములకలపల్లి మండల మహిళా అధ్యక్షురాలిగా పూసుగూడెంకు చెందిన తేజావత్ పార్వతి నియమితులయ్యారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు రంగాకిరణ్ చేతుల మీదుగా శనివారం నియామక పత్రాన్ని అందుకున్నారు.

పాఠశాలను సందర్శించిన తహసీల్దార్

మణుగూరురూరల్: మండల పరిధిలోని రామానుజవరం గ్రామపంచాయతీ కొండాయిగూడెం గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు మణుగూరు తహశీల్దార్ వి.రాఘవరెడ్డి శనివారం తనిఖీ చేసి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీఓ పల్నాటి వెంకటేశ్వరరావు, రెవిన్యూ, మండల పరిషత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ

అశ్వాపురం: మండల పరిధిలోని మిట్టగూడెం ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలో ఇన్ఫోసిస్ లిమిటెడ్ కంపెనీ సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా సంస్థ నిర్వాహకులు వాసిరెడ్డి వంశి ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు బ్యాగ్స్, స్టేషనరీ కిట్స్ ఎంపీపీ ముత్తినేని సుజాత చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో గరికపాటి అంజన్‌రావు, నాగేందర్, హెచ్ఎం వీరస్వామి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు.

చంద్రశేఖర్ చిరస్మరణీయుడు

ములకలపల్లి: 50 ఏళ్ల ఉద్యమ జీవితంలో ఎన్నో త్యాగాలు చేసిన రాయల చంద్రశేఖర్ చిరస్మరణీయుడని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కెచ్చెల రంగారెడ్డి, జిల్లా కార్యదర్శి ముద్దా భిక్షం అన్నారు. డివిజన్ కార్యదర్శి గోకినపల్లి ప్రభాకర్ అధ్యక్షతన శనివారం జగన్నాథపురంలో ఏర్పాటు చేసిన చంద్రశేఖర్ సంస్మరణ సభలో వారు మాట్లాడారు. తొలుత చంద్రశేఖర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అమర్లపూడి రాము, నూపా భాస్కర్, జిల్లా కమిటీ సభ్యులు పోతుగంటి లక్ష్మణ్, నిమ్మల రాంబాబు, టి.దుర్గమ్మ, డివిజన్ నాయకులు రామకృష్ణ, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.